
సాక్షి ఒడిశా

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,76,581లు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయం

-IIలో

వీరుడా.. వందనం

- కశ్మీర్ ఉగ్రదాడిలో ఒడిశాకు చెందిన జవాన్ వీరమరణం



-IIలో

న్యూస్‌రీల్

దివంగత సీఎం త్రిపాఠికి నివాళులు



త్రిపాఠి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు

రాయగడ: రాష్ట్రమాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత సదాశివ త్రిపాఠి జయంతి పురస్కరించుకుని స్థానిక సంస్కృతి భవనంలో జిల్లా యంత్రాంగం శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక, రాష్ట్ర పౌర సరఫరాల వినియోగదారుల సంక్షేమశాఖ మంత్రి అతున్ సవ్యసాచి నాయక్, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, పట్టణ ప్రముఖులు డాక్టర్ డీకే మహంతి, రాజేష్ పాఢి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రిపాఠి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను వక్తలు కొనియాడారు.

తెలుగులో మజ్జిగౌరి సంధ్యా హారతి



ఒడియాలో విడుదలైన వీడియో

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం మజ్జిగౌరి అమ్మవారిపై ఒడియాలో ఇటీవల విడుదలైన సంధ్యాహారతి వీడియోకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఈ నేపథ్యంలో త్వరలో తెలుగులో కూడా దీనిని చిత్రీకరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు ప్రముఖ గాయకుడు, దర్శకుడు రాజేష్ పాఢి ఆయన కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. ఉత్తరాంధ్రలో ఎంతో ప్రాచుర్యం పొందిన అమ్మవారి లీలలతో పాటు ముఖ్య ఘట్టమైన సంధ్యా హారతిపై తెలుగులో వీడియో చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి అనువాద గీతం రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనువాదకర్తగా ప్రముఖ రచయిత అషుతోస్ పాత్రోను సంప్రదించామన్నారు. సమావేశంలో డాక్టర్ డీకే మహంతి, మజ్జిగౌరి మందిరం అర్చకులు చంద్ర బెరుకో పాల్గొన్నారు.


బి.సింగపూర్‌లో నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది

జయపురం: భువనేశ్వర్‌కు చెందిన కోయర్ నేత్ర సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి బి.సింగపూర్‌లో ఉచిత నేత్రవైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ పరిధిలోని పాడాపాదర్, చిపిటిగుడ, ఖుంటియపల,"పర్లియగుడ తదితర గ్రామాలకు చెందిన వందలాది మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న వారికి శస్త్రచికిత్స, కళ్లద్దాలు అందజేసేందుకు ఎంపిక చేశారు. శిబిరంలో వైద్య సిబ్బంది డాక్టర్ సోనియా వర్మ, సీతల కొఠారి, ఎలీన సాగడియా, నిఖిత సర్బమ్, పాయల్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరి మృతి



ఆస్పత్రిలో క్షతగాత్రులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రానికి 40 కిలోమీటర్ల దూరంలోని రాయఘడ బ్లాక్ కెరడంగ గ్రామం నుంచి నువాగడ బ్లాక్ ఖోజురిపద గ్రామానికి వెళ్తున్న ఆటో ఖోజురిపద ఘాటీ వద్ద అదుపుతప్పి లోయలోకి పడిపోయింది. ఘటనలో మహిళ సహా ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మరో 8మందికి తీవ్రగాయాల కావడంతో ఖోజురిపద ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఘటనపై ఖోజురిపద పోలీసులు కేసు నమోదు చేశారు.

కునాన్‌పల్లిలో ఇద్దరికి గాయాలు..

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కునాన్‌పల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొని, నలుగురుకి గాయాలయ్యాయి. బాధితులను కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

దేవదేవుడికి దిక్కెవ్వరు!



బలభద్ర, సుభద్ర సమేతంగా జగన్నాథుడు

- ఆందోళన కలిగిస్తున్న పూరీ జగన్నాథాలయంలో గల్లంతు నిర్వాకం
- కొద్ది రోజుల క్రితం రత్న భాండాగారం తాళం చెవి మాయం
- తాజాగా ఆచూకీ లేని ఆస్తులకు సంబంధించి కీలక పత్రాలు
- గాలింపు చర్యలకు ఆదేశించిన రాష్ట్ర హైకోర్టు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దేవస్థానంలో గల్లంతు నిర్వాకం సర్వత్రా కలకలం రేపుతోంది. స్వామివారి రత్న భాండాగారం తాళంచెవి, స్వామి ఆస్తుల వివాదానికి సంబంధించిన కీలక పత్రాలు గల్లంతు కావడం ఆందోళన రేకెత్తిస్తోంది. వివాద పరిష్కారానికి హైకోర్టు ఆశించిన 2 కీలకమైన ఫైళ్లు అకస్మాతుగా అదృశ్యమైనట్లు అనుబంధ అధికార, సిబ్బంది వర్గాలు నిస్సహాయత ప్రదర్శించారు. ఈ దస్తావేజుల కనిపించక పోవడంతో న్యాయశాఖ హుటాహుటిన గాలింపు చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. అప్పటికీ కనిపించకుంటే తదుపరి కార్యాచరణకు సిద్ధం కావాలని స్పష్టం చేసింది. జగన్నాథ అలయ అడ్మినిస్ట్రేషన్(ఎస్‌జేటీఏ)కి సంబంధించిన 2 ముఖ్యమైన ఫైళ్లు కనుగొనలేని జాబితాలో ఉన్నాయి. ఈ విషయం బుధవారం వెలుగులోకి రాగా.. భారతీయ జనతా పార్టీ ఫైళ్ల గల్లంతు పురస్కరించుకుని పోలీసు ఠాణాలో శుక్రవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు దాఖలు చేసింది. ఫైలు కనుమరుగు కావడంపై విచారణ జరుగుతోంది. దీనికి సంబంధించి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని న్యాయశాఖ మంత్రి జగన్నాథ్ సరకా తెలిపారు. 'కీలకమైన ఫైళ్లు కనిపించడం లేదు. సకాలంలో తారస పడకుండా పోయి ఉంటాయి. ఎక్కడో పెట్టారో గుర్తురాని పరిస్థితి ఉండవచ్చు. ఈ నేపథ్యంలో పత్రాలను కనుగొనడానికి న్యాయశాఖ చర్యలు ప్రారంభించింద'ని వివరించారు.

విపక్షాల విమర్శలు..

సత్వర చర్యలు చేపట్టేందుకు న్యాయశాఖ జగన్నాథ ఆలయ అడ్మినిస్ట్రేషన్ 2 ఫైళ్లు గుర్తించాలని లా డిపార్ట్‌మెంట్ సర్క్యులర్ జారీ చేసిన తర్వాత రాష్ట్రప్రభుత్వం వివిధ వర్గాల నుంచి దాడికి గురైంది. అనుబంధ విభాగంలో పూర్తిస్థాయిలో సోదాలు చేసినా దొరకకపోవడంతో సర్క్యులర్ జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనపై విపక్ష నేతలు ఘాటుగా స్పందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు కురిపిస్తున్నారు. గతంలో జగన్నాథుని రత్న భాండాగారం తాళం చెవులు అదృశ్యమయ్యాయి. ఈ వివాదం ఇంత వరకు కొలిక్కి రాలేదు. ఇంతలో కీలకమైన 2 ఫైళ్లు గల్లంతైన వార్త మరింత కలకలం రేపుతోంది. ప్రాచీన దేవస్థానానికి కనీస భద్రత పట్ల రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందనే ఆరోపణలు బలం పుంజుకుంటున్నాయి.

సర్క్యులర్ జారీ..

జగన్నాథ దేవాలయం, ఆలయ ఆస్తులను రక్షించడంలో బిజూ జనతాదళ్ చిత్తశుద్ధి కొరవడుతోందని ప్రతిపక్ష భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. గల్లంతైన 2 ఫైళ్లు పత్రాలలో ఉన్న సమాచారాన్ని అణచివేయడానికి కొంతమంది ఉద్దేశపూర్వకంగా ఫైళ్లను కనుమరుగు చేసి ఉంటారని ప్రముఖ రాజకీయ నాయకుడు బిజయ్ మహాపాత్రో వ్యాఖ్యానించారు. ముఖ్యమైన ఫైళ్లు కనిపించకుండా పోయాయని ప్రభుత్వం భావిస్తే పోలీసులకు ఫిర్యాదు(ఎఫ్ఐఆర్) నమోదు చేయాలన్నారు. న్యాయశాఖ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం జేటీఏ-55/2006(పార్టు), జేటీఏ-06/2014 నంబర్ల ఫైళ్లు జేటీఏ సెక్షన్‌లో గల్లంతయ్యాయి.



క్యాపిటల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ ప్రతినిధి బృందం

ప్రాధాన్యతతో గాలించాలి..

డిపార్ట్‌మెంట్‌లోని అన్ని విభాగాలు అత్యంత ప్రాధాన్యతతో గల్లంతైన ఫైళ్ల కోసం గాలించాలని అధికారుల ఆదేశించారు. పైన పేర్కొన్న ఫైళ్లు అందుబాటులో తారసపడిన మరుక్షణమే జేటీఏ సెక్షన్‌కు సమర్పించాలని కోరారు. హైకోర్టు ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ చేపట్టే నేపథ్యంలో ఈ ఫైళ్లలో సమాచారం అత్యంత కీలకం, అత్యవసరంగా పేర్కొన్నారు. పూర్తిస్థాయి గాలింపు తర్వాత కూడ గల్లంతైన ఫైళ్ల జాడ లేకపోతే తక్షణమే సమాచారం చేరవేయాలి. తదుపరి అవసరమైన చర్యల కోసం విభాగం చర్యలు చేపడుతుందని రాష్ట్ర న్యాయశాఖ డిప్యూటీ సెక్రటరీ ఎ.మహంతి అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదు..

'జగన్నాథ ఆలయం 2 కీలక ఫైళ్లు గల్లంతు అత్యంత దురదృష్టకరం. గతంలో జగన్నాథుని రత్న భాండాగారం తాళంచెవి అదృశ్యమైనట్లు హడావిడి చేసి, తదుపరి నకలు తాళం లభమైనట్లు నాటకీయత ప్రదర్శించారు. అదే తరహాలో ప్రస్తుతం ఫైళ్ల గల్లంతు, కొద్ది రోజుల తర్వాత నకలు రూపంలో ప్రత్యక్షం అవుతాయేమో'నని పూరీ జిల్లా బ్రహ్మగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి బృందం నాయకుడు లలితేందు బిద్యాధర మహాపాత్రో వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజల ఆరాధ్యదైవం జగన్నాథ దేవస్థానం సంబంధిత ఫైళ్లు లోక్‌సేవా భవన్‌లో గల్లంతైనట్లు కలకలం రేగింది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టి, బాధ్యులకు వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టాలని నగరంలోని క్యాపిటల్ ఠాణాలో ఆరుగురు సభ్యుల బీజేపీ ప్రతినిధి బృందం శుక్రవారం ఫిర్యాదు చేసింది. దీనిపై ప్రాథమిక సమాచార నివేదిక(ఎఫ్ఐఆర్) నమోదు చేసినట్లు సమాచారం.

రథయాత్రకు సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో ఏటా ఆడంబరంగా జరిగే జగన్నాథ రథాయాత్రకు జిల్లా అధికారులు స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం హాలులో సన్నాహక సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. సమావేశానికి అధ్యక్షత సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్ వహించగా, ఏడీఎం సంగ్రాంశేఖర పండా, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, సబ్ డివిజనల్ పోలీసు అధికారి రామకృష్ణ పతి, ఏడీఎఫ్ఓ అశోక్‌కుమార్ బెహరా, రోడ్లు, భవనాల శాఖ, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీకాంత్ సామల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మందిరం ఆదాయ, వ్యయాలను వివరించారు. అనంతరం రథయాత్ర కమిటీ కోశాధికారి తహసీల్దార్, సహ కోశాధికారిగా సబ్ కలెక్టర్ వ్యవహరిస్తారని ఏడీఎం పండా తెలిపారు. యాత్రకు అవసరమయ్యే కలప, మీనాబజార్, పరిశుభ్రత, తాగునీరు, సీసీ కెమెరాలు, విద్యుత్ తదితర విభాగాలకు కమిటీ సభ్యులను నియమించారు. జూన్ 20న రథయాత్ర జరగనుండగా, 3రథాల తయారీకి కమిటీ నిర్ణయించారు. సమావేశంలోసీనియర్ సిటిజన్లు, బీజేడీ నాయకులు ప్రదీప్ నాయక్, బసంత దాస్, రాజేంద్ర బెహరా తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ త్రిలోచన్ కనుంగో మృతి



త్రిలోచన్ కనుంగో(ఫైల్)

భువనేశ్వర్: జగత్‌సింగ్‌పూర్ లోక్‌సభ మాజీ సభ్యుడు త్రిలోచన్ కనుంగో(83) భువనేశ్వర్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. 1940 నవంబర్ 24న కటక్ జిల్లా బదాములే గ్రామంలో జన్మించిన ఆయన.. అనారోగ్య సమస్యలతో మార్చి 30న ఆస్పత్రిలో చేరారు. అప్పటి నుంచి ప్రాణాలతో పోరాడుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కనుంగో మరణవార్త తెలియగానే వివిధ వర్గాల నుంచి సంతాపం వెల్లువెత్తింది. 3సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందిన త్రిలోచన్ కనుంగో బిజూ జనతాదళ్(బీజేడీ) అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. ముక్కుసూటిగా వ్యవహరించే వ్యక్తిగా పేరొందిన ఆయన అప్పటి గోవింద్‌పూర్ అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా 3సార్లు, జగత్‌సింగ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి ఒకసారి గెలుపొందారు. రెండుసార్లు కటక్ నగర మేయర్‌గా కూడా ఎన్నిక కావడం విశేషం. తన రాజకీయ పదవీ కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై రాసిన వ్యాసాలు అత్యంత విశ్లేషణాత్మకమైనవిగా ఆదరణ పొందాయి. ఆయన మృతిపట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జారీ చేసిన సంతాప సందేశంలో, కనుంగోను ప్రముఖ పార్లమెంటేరియన్, ఆర్థికవేత్త, సామాజిక కార్యకర్తగా అభివర్ణించారు. సామాన్యులకు మిత్రుడిగా ఉంటూ జీవితాంతం సామాజిక సేవకే అంకితమయ్యారని కొనియాడారు. కనుంగో ఎంపీగా, డిప్యూటీ స్పీకర్‌గా, రెండో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్‌గా, కటక్ నగర మేయర్‌గా ఎన్నో విశేషమైన పనులు చేశారు. కనుంగో నిస్వార్థ సేవను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని సీఎం సంతాప సందేశంలో పేర్కొన్నారు. అంత్యక్రియలు రాష్ట్ర లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

గవర్నర్‌కు లోకాయుక్త నివేదిక



రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్‌కు రాష్ట్ర లోకాయుక్త 4వ వార్షిక నివేదిక-2022ను శుక్ర వారం సమర్పించారు. ఈ సందర్భంగా లోకాయుక్త అధ్యక్షుడి ఆధ్వర్యంలో సభ్యుల బృందం రాజ్‌భవన్‌ను సందర్శించారు. గవర్నర్‌తో భేటీ కావడంతో పాటు ఒడిశా లోకాయుక్త చట్టం-2014 సెక్షన్ 48 ప్రకారం సమగ్ర వార్షిక నివేదికను అందజేశారు. - భువనేశ్వర్

ఒడియాలో బోర్డులు లేకపోతే జరిమాన



అధికారులతో మాట్లాడుతున్న ఏడీఎం సంగ్రాంశేఖర పండా

పర్లాకిమిడి: స్థానిక మున్సిపాలిటీ, కాశీనగర్ ఎన్ఏసీ లలో వ్యాపార సంస్థలు, దుకాణాల వద్ద సూచిక బోర్డులు విధిగా ఒడియాలో ఉండాలని జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సంగ్రాంశేఖర పండా ఆదేశించారు. పట్టణంలోని ఏడీఎం కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కార్మిక అధికారి లోక్‌నాథ్ పండా, మున్సిపల్ ఈఓ వనమాలి సత్పతి, కాశీనగర్ ఎన్ఏసీ అధికారి ఉజ్వల్లతా స్వాలసింగి, మార్కెట్ కమిటీ, జీడి పరిశ్రమల అధికారులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర అధికార భాషలో లేని ప్రైవేటు వ్యాపార సంస్థలకు తొలుత రూ.5 వేల జరిమాన, రెండోసారి ఉత్పన్నమైతే రూ.25 వేలు జరిమానగా విధించాలని ప్రకటించారు. సమావేశంలో కార్మికశాఖ ఉప అధికారి సోమనాథ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో బాలలు మృతి



చందన్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

మల్కన్‌గిరి: జిల్లాలోని పాడియా సమితి ఉంద్రుకొండ పంచాయతీ రోడగూడ గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై, ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో గ్రామానికి చెందిన దుల పొడియామి కుమారుడు చందన్ పొడియామి(12), లచ్చ మాఢి కుమారుడు మాన మాఢి(9) తోటి పిల్లలతో కలిసి ఆటలు ఆడుతున్నారు. దాగుడు మూతలు ఆటలో భాగంగా సమీపంలోని చెట్టు ఎక్కి, దాక్కున్నారు. అయితే చెట్టు పైనుంచి వెళ్తున్న విద్యుత్ వైర్‌కు ప్రమాదావశాతు తాకడంతో షాక్‌కు గురై, ఇద్దరూ కింద పడిపోయారు. గమనించిన తోటి వారు తల్లిదండ్రులకు చెప్పడంతో అంతా కలిసి కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్లారు. అప్పటికే బాలలు ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న కలిమెల పోలీసులు ఆరోగ్య కేంద్రానికి చేరుకొని, ఘటనపై వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తల్లిదండ్రులకు అప్పగించారు. అప్పటి వరకు ఆటలాడుకుంటున్న చిన్నారులు.. ఇలా చలనం లేకుండా పడి ఉండటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎంకేసీజీ సీటీ స్కాన్‌లో మంటలు



మంటలకు దగ్ధమైన సీటీ స్కాన్ విభాగ కేబుళ్లు




భయంతో ఆస్పత్రి వరండాలోనే నిరీక్షిస్తున్న రోగులు, బంధువులు

బరంపురం: దక్షిణ ఒడిశా ప్రజలకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్న బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రిలోని సూపర్ స్పెషాలిస్ట్ సీటీస్కాన్ వార్డులో శుక్రవారం ఉదయం అకస్మాతుగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడున్న రోగుల, వారి బంధువులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. దీనిపై సామచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు.. ఘటనా స్థలానికి చేరుకొని, మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు ఎంకేసీజీ వైద్యులు తెలిపారు.

రూ.200 కోట్లతో బరంపురం అభివృద్ధికి చర్యలు

- త్వరితగతిన ఓడీఆర్‌పీ పనులు పూర్తి చేయాలి
- అధికారులకు మేయర్ సంఘమిత్ర దొళాయి ఆదేశం



సమావేశానికి హాజరైన మేయర్ సంఘమిత్ర, కమిషనర్ జెనా, ఎంపీ సాహు, ఎమ్మెల్యే విక్రమ్

బరంపురం: రోజురోజుకీ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బరంపురం నగరంలో ఓడీఆర్‌పీ(ఒడిశా డిజాస్టర్ రీకవరీ ప్రాజెక్ట్) కింద జరుగుతున్న నిర్మాణ పనులు వేగవంతం చేయాలి నగర మేయర్ సంఘమిత్ర దొళాయి అధికారులను ఆదేశించారు. బరంపురం మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) సమావేశ మందిరంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. బీఎంసీ కమిషనర్ సోనాల్ జెనా అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్‌పండా, డిప్యూటీ మేయర్ వివేక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఒడిశా డిజాస్టర్ రీకవరీ ప్రాజెక్టు కింద రహదారులు, కాలువల నిర్మాణం, మురుగువాడల అభివృద్ధి కోసం నిర్మాణం జరగాల్సిన పనులపై నగరంలోని 40 వార్డుల్లో ఇప్పటికే డీపీఆర్ ప్రక్రియ పూర్తయ్యిందని పేర్కొన్నారు. వీటిలో కొన్ని వార్డుల కోసం టెండర్స్ పూర్తి చేశామన్నారు. మొత్తం టెండర్ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు స్పష్టంచేశారు. స్థానిక ప్రేమనగర్ మెయిన్ రోడ్డులో ఓడీఆర్‌పీ కింద రహదారి విస్తరణ, కాలువల నిర్మాణం కోసం కావాల్సిన స్థలం కొద్ది రోజుల క్రితం బీఎంసీ అధికారులు పలు అక్రమ నిర్మాణాలను తొలగించారని గుర్తుచేశారు. పలువురు బాధితులకు నష్ట పరిహారం చెల్లించేందుకు పూర్తిస్థాయిలో చర్చలు జరిపిన తరువాతే తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో సమ్మందిత అధికార్లు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాసిడ్ తాగి వృద్ధురాలి మృతి


ఆస్పత్రిలో మృతిచెందిన కొండమ్మ

గంట్యాడ: పొరపాటున యాసిడ్ తాగిన ఓ వృద్ధురాలు మృతి చెందింది. మండలంలోని రామవరం గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొటుపురెడ్డి కొండమ్మ (60) శుక్రవారం ఉదయం టిఫిన్ చేసిన తర్వాత కిటికీ దగ్గర వాటర్ బాటిల్‌లో ఉన్న యాసిడ్‌ను తాగునీరు అనుకుని పొరపాటున తాగేసింది. దీంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో యోకోమ జాబ్ డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. ఈ జాబ్ డ్రైవ్‌కు యోకోమ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్ డ్రైవ్‌లో 65 మంది ఇంటర్వ్యూకు హాజరుకాగా వారిలో 16 మంది యోకోమ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.రాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం కళాశాలలో నిర్వహించడం ఇదే మొదటిసారి అని, ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇలాంటి అవకాశాలని నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

మరొకరికి కోవిడ్ పాజిటివ్

విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లాలో కోవిడ్ కేసుల సంఖ్య మూడుకు చేరింది. గురువారం ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణకాగా, శుక్రవారం నిర్వహించిన పరీక్షల్లో మరొకరికి కోవిడ్ నిర్ధారణ అయింది. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉండడంతో కోవిడ్ కిట్ అందించి హోమ్ ఐసోలేషన్ చేసినట్టు సర్వజన ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

రాయితీపై సూక్ష్మసేద్యం పరికరాలు

వేపాడ: జిల్లాలో 891 హెక్టార్లలో సాగుచేసేందుకు అనువుగా తుంపర, బిందు సేద్యం పరికరాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం సమకూర్చిందని ఏపీ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు పథక సంచాలకులు పి.ఎన్.లక్ష్మీనారాయణ తెలిపారు. వావిలపాడులో ఈగల రాంబాబు, చామలాపల్లిలో తుమ్మి నరసింహులు, కుమ్మపల్లిలో దొగ్గ రమణమ్మకు మంజూరు చేసిన యూనిట్ పరికరాలు, వినియోగంపై పరిశీలించారు. ఒక్కోయూనిట్ విలువ రూ.23,984 కాగా 55 శాతం రాయితీపై అందజేశామన్నారు. బిందు, తుపంర సేద్యం వల్ల తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేసుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి మూర్తి, రైతు భరోసా వీఏఏలు పాల్గొన్నారు.

మైనర్‌పై లైంగిక దాడి కేసులో.. నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

- రూ.16వేల జరిమానా
- బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశం
- పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి షేక్ సికింద్ర భాషా

విజయనగరం లీగల్: బాలికను లోబర్చుకొని లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణ రుజువు కావడంతో గంట్యాడ మండలం కొర్లాం గ్రామానికి చెందిన కారు చిన్నారావుకు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.16వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి షేక్ సికింద్ర భాషా శుక్రవారం సంచలన తీర్పు వెల్లడించారు. ఈ కేసులో బాధితరాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవా సంస్థకు సూచించారు. ఈ కేసుకు సంబంధించి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు చిన్నారావు ఎస్.కోట ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఇంటి దగ్గర విద్యార్థులకు ట్యూషన్లు చెబుతూ జీవనం సాగిస్తున్నాడు. 2021 సెప్టెంబర్ 21న తన వద్దకు ట్యూషన్‌కు వచ్చిన బాలికను లోబర్చుకొని పలుమార్లు లైగింక దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ టి.త్రినాథ్ పోక్సో చట్టం, ఇండియన్ పీనల్ కోడ్ చట్టం ప్రకారం చిన్నారావుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. లైంగిక దాడి కేసులో నిందితుడికి శిక్షపడేలా త్వరితగతిన దర్యాప్తు చేపట్టిన డీఎస్పీ త్రినాథ్, ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మిని ఎస్పీ దీపిక ప్రశంసించారు.

జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ప్రణాళిక మండలి సమీక్షలో మంత్రి అతున్ సవ్యసాచి
- ఖర్చుకాని నిధులు ఇతర పనులకు మళ్లించాలని సూచన


సమావేశంలో పాల్గొన్న అధికారులు ప్రజా ప్రతినిధులు


సమీక్షలో ప్రసంగిస్తున్న మంత్రి నాయక్, పక్కన మంత్రి సరక

రాయగడ:

వివిధ అభివృద్ధి పనుల కోసం రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఏళ్ల తరబడి ఖర్చు కాకుండా మూలుగు తున్నాయని, అటువంటి నిధులను మళ్లించి ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ప్రణాళిక మండలి అధ్యక్షుడు అతున్ సవ్యసాచి నాయక్ సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక మండలి 20వ సమీక్ష సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం ఆ దిశగా అధికారులు కూడా కృషి చేయాలన్నారు. జిల్లాలో గత కొన్నాళ్లుగా అభివృద్ధి కోసం మంజూరైన నిధులు ఎటువంటి పనుల కోసం వినియోగించకుండా మురుగున పడ్డాయని విచారం వ్యక్తంచేశారు. ఆయా వివరాలను వారం రోజుల్లోగా సంబంధిత శాఖ అధికారులు పంచాయతీల వారీగా తనకు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం అవసరమయ్యే పనుల కోసం నిధులు వెచ్చించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రధానంగా రాయగడ, కాశీపూర్ వంటి సమితుల్లో గత కొన్నేళ్లుగా నిధులు ఖర్చుకాకుండా ఉన్నట్లు తేలిందని, ఆయా సమితుల బీడీఓలు త్వరితగతిన వివరాలు సమర్పించాలన్నారు.

రూ.1,383 కోట్లతో అభివృద్ధి పనులు..

జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.1,383 కోట్ల 29 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి నాయక్ సమీక్ష తెలియజేశారు. అదేవిధంగా గత ఏడాది 2021–22లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాకు సుమారు రూ.1,217 కోట్ల 33 లక్షలు మంజూరు చేసినట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని మంత్రి తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగునీటి వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివాసీ జిల్లాలైన ప్రధానంగా రాయగడ, కొరాపుట్ వంటి జిల్లాల్లో మిల్లెట్ మిషన్ వంటి పథకాలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు. రాగి పంటలపై రైతులకు తగు సూచనలు సలహాలు అందిస్తున్నామని, స్థానిక జిల్లాలో రాగి పంటలపై రైతులు అధిక శ్రద్ధ వహిస్తుండటంతో ప్రభుత్వం కూడా ముందడుగు వేస్తోందని భరోసా ఇచ్చారు.

పారిశ్రామికంగా అభివృద్ధి..

ఖనిజ సంపదలకు నిలయంగా ఉన్న రాయగడ జిల్లాలో త్వరలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి నాయక్ వెల్లడించారు. పరిశ్రమలతోనే ప్రగతి సాధ్యపడుతుందని, దీనికి అనుగుణంగా నిక్షేపమైన ఖనిజ వనరులను సద్వినియోగ పరిచే దిశగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కాసీపూర్ వంటి సమితిలో త్వరలో కొత్త పరిశ్రమలు రానున్నట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న రాయగడ.. భవిష్యత్‌లో మరిన్ని కొత్త పరిశ్రమలతో కలకలలాడుతోందన్నారు. దీంతో నిరుద్యోగ సమస్యకు తెరపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జిల్లాలోని ప్రతి పంచాయతీలో సుమారు 50 నుంచి 50 కిలోమీటర్ల పొడవున కొత్త రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు.

ఘన స్వాగతం పలికిన నాయకులు..

జిల్లా ప్రణాళిక మండలి అధ్యక్షుడు, రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల సంక్షేమశాఖ మంత్రి అతున్ సవ్యసాచి నాయక్‌కు జిల్లా బీజేడీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. హెలీకాప్టర్‌లో స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో దిగిన మంత్రి నాయక్‌కు మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, కౌన్సిలర్లు, ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్ పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి..

సమీక్షలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజా ప్రతినిధులు వివిధ సమస్యలను జిల్లా పరిషత్ సభ్యులు సంధ్యా పులక, ధవలేశ్వర్ నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక మాట్లాడుతూ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న రాయగడను ప్రగతి పథంలో నడిపించేందుకు అంతా కలసికట్టుగా కృషి చేయాలన్నారు. అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించాలని, అప్పుడే మనం ప్రగతిని చూడగలమన్నారు. అందుకు ప్రజా ప్రతినిధులు కూడా తమవంతు సహకారాన్ని అందించాలని సూచించారు. గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ స్వాధా దేవ్ సింగ్, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతీ మాఝి, 11 సమితుల బీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరుడా.. వందనం

- కశ్మీర్ ఉగ్రదాడిలో ఒడిశాకు చెందిన జవాను వీరమరణం


దేవాశిష్ బిస్వాల్(ఫైల్)


శోకసంద్రంలో జవాను కుటుంబీకులు

భువనేశ్వర్: లాన్స్ నాయక్ దేవాశిష్ బిస్వాల్ మరణ వార్తతో స్వగ్రామం అల్గుమ్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. పూరీ జిల్లా సత్యబాది ప్రాంతంలోని అల్గుమ్ గ్రామానికి గురువారం రాత్రి ఈ విషయం చేరింది. గురువారం కశ్మీర్ లోని పూంచ్ జిల్లాలో గురువారం రాత్రి జరిగిన ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు ఆర్మీ జవాన్లు ప్రాణాలు కోల్పోగా.. ఇందులో దేవాశిష్ ఒకరు. దేశం కోసం వీరోచితంగా ప్రాణాలర్పించిన ఆతని త్యాగాన్ని కుటుంబ సభ్యులు, అల్గుమ్ గ్రామస్తులు కొనియాడుతున్నారు. దేబాశిష్ ఆర్మీలో రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్‌కు చెందిన జవాను. జమ్మూ–కాశ్మీర్ ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో తలమునకలై ఉన్న తరుణంలో ఉగ్రవాదుల దాడికి బలి అయ్యాడు. దేబాశిష్‌కు సంగీతతో 2021లో అక్షయ తృతీయ రోజున వివాహం జరిగింది. వీరికి 7 నెలల కుమార్తె ఉంది. 2 రోజుల అనంతరం వార్శికోత్సవం జరుపుకోవాల్సి ఉండగా.. ఇందులో దేవాశిష్ ఉగ్రవాదుల తూటాలతో కుప్పకూలి పోవడం దురదృష్టకరం. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం తెలిపారు. 'జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఒడిశా వీర జవాన్ దేబాశిష్ బిస్వాల్ వీరమరణం పొందిన వార్త చాలా బాధాకరం. దేశ భద్రత కోసం ఆయన చేసిన త్యాగాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఇలాంటి విషాద సమయంలో ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి'ని తెలియజేశారు.

ధార్మిక చింతనకు ప్రతీక రంజాన్

విజయనగరం అర్బన్: సామరస్యానికి, సహృద్భావానికి, సర్వ మానవ సమానత్వానికి, కరుణ, దాతృత్వానికి, ధార్మిక చింతనకు ప్రతీక రంజాన్ పర్వదినమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. జిల్లాలోని ముస్లింలకు శుక్రవారం ఓ ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాసాలు, దీక్షలు, దానధర్మాలు, ధార్మిక చింతనతో సాగే రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదిగా అభివర్ణించారు. పవిత్ర ఖురాన్ వ్యాఖ్యలను సదా స్మరించుకుంటూ.. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని, అదే పవిత్ర రంజాన్ ఇచ్చే శుభసందేశమని పేర్కొన్నారు.

271 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ అధికారులు


బరంపురం: గంజాయితో పోలీసుల అదుపులో నిందితుడు

బరంపురం: గంజాం, కొరాపుట్ జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 271 కిలోల గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గంజాం జిల్లా పోలీసు పరిధి 56వ నంబర్ జాతీయ రహదారిపై బొలేరోలో గంజాయి రవాణా జరుగుతున్న ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దీనిపై ఆశాఖ ఎస్పీ రమేంద్రనాయక్ ఆదేశాలతో సిబ్బంది శుక్రవారం ఉదయం బరంపురం నగర శివారు జాతీయ రహదారిలో రెక్కీ నిర్వహించారు. పట్టపూర్ పోలీసుస్టేషన్ పరిధి పుంజికైయా జంక్షన్ వైపు వస్తున్న వాహనాన్ని సోదా చేయగా, 20 బస్తాల్లో 230 కిలోల గంజాయిని గుర్తించారు. ఈ మేరకు సరుకు, వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు సన్నోఖేముండి బ్లాక్‌కు చెందిన నారాయణ రౌత్‌గా గుర్తించారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.44 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

అంతర్ రాష్ట్ర ముఠా అరెస్ట్..

జయపురం: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాను జయపురం ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన గౌరవ చౌహాన్(19), ఢిల్లీకి చెందిన రాహుల్ సింగ్(23)గా గుర్తించారు. వారి నుంచి 41.2 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ అధికారి దుర్యోధన బిశ్వాల్ తెలిపారు. ఆయనతో పాటు ఏఎస్ఐ ఎం.లక్ష్మణరావు, సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో జయపురం రైల్వేస్టేషన్ కూడలి వద్ద ఇద్దరు యువకులు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ప్రశ్నించగా, పొంతలేని సమాధానాలు చెప్పడంతో బ్యాగులను తనిఖీ చేయడంతో గంజాయి బయటపడింది. దీంతో నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేసి, విచారించగా స్థానికంగా గంజాయి కొనుగోలు చేసి, ఢిల్లీలో విక్రయించేందుకు తీసుకు వెళ్తున్నట్లు అంగీకరించారు. దీనిపై కేసు నమోదు చేశామని, స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.4 లక్షల 12 వేలు ఉంటుందని బిశ్వాల్ వెల్లడించారు.


జయపురం: పట్టుబడిన గంజాయితో నిందితులు, ఎక్సైజ్ సిబ్బంది

సైబర్ నేరాలపై నిఘా


నేరసమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా వేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సైబర్ నేరం తీరును బాధితుల నుంచి తెలుసుకుని, వెంటనే బ్యాంకు అధికారులతో మాట్లాడి ఖాతాల నుంచి ఆర్థిక లావాదేవీలు జరగకుండా నిలుపుదల చేయాలన్నారు. నిందితుల ఫోన్ నంబర్లు సేకరించి, వారి చిరునామాలు, కాల్స్‌తో కేసులను చేధించాలని సూచించారు. గంజాయి రవాణాపై నిఘా పెంచాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చి, లాడ్జిల్లో బసచేసిన వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత లాడ్జి యజమానులు తప్పనిసరిగా ఆయా పోలీసు స్టేషన్‌లకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తిచేయాలని, నాన్ బెయిలబుల్ వారెంట్లను తక్షణమే ఎగ్జిక్యూట్ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన కొత్తవలస సీఐ ఎస్.బాల సూర్యారావును బెస్ట్ ఫెర్మార్మర్‌గా ఎంపిక చేసి ప్రశంసాపత్రం అందజేశారు. సమావేశంలో సెబ్ అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, విజయనగరం ఇన్‌చార్జి డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు, దిశ మహిళా డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, న్యాయ సలహాదారులు వై.పరశురాం, డీపీఓ ఏఓ వెంకటరమణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన పోలీసులకు ప్రశంసలు

జిల్లా పోలీస్ శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వహించి, దొంగతనం కేసులను చేధించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఎం.దీపిక అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. ప్రశంసపత్రాలు పొందిన వారిలో రాజాం సీఐ కె.రవికుమార్, సీసీఎస్ ఎస్ఐ బి.సాగర్‌బాబు, నెల్లిమర్ల ఎస్ఐ పి.నారాయణరావు, రామభద్రపురం ఎస్ఐ బి.సురేంద్రనాయుడు, వన్ టౌన్ ఎస్ఐ బి.మురళి, కొత్తవలస ఎస్ఐలు వై.వి.జనార్దనరావు, సీహెచ్.హేమంత్‌కుమార్, దిశ మహిళా ఎస్ఐ ఎన్.పద్మావతి, గరివిడి ఏఎస్ఐ సీహెచ్.హరి, ఎమ్‌వి.రమణ, బొండపల్లి ఏఎస్ఐ ఎన్.లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

ముగిసిన 'ఫండమెంటల్ గ్లాసర్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్' సదస్సు


వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ యూనివర్సిటీ, కళాశాలల బోధన సిబ్బంది

విజయనగరం అర్బన్: కేంద్రియ గిరిజన యూనివర్సిటీలో 'ఫండమెంటల్ గ్లాసర్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్(ఇంగ్లిష్–హిందీ–తెలుగు)' పేరుతో జాతీయ విద్యామంత్రిత్వ శాఖ సారథ్యంలోని కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సీఎస్‌టీటీ) సహకారంతో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో 2,855 ఇంగ్లిష్–హిందీ పదాలకు తెలుగులో అర్థాలను రూపొందించారు. ఈ పదాల రూపకల్పనలో పలు కేంద్రియ విశ్వవిద్యాలయాలు నిపుణుల సహకారం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఎస్‌టీటీ తరఫున జైసింగ్ రావత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చినందుకు వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ బొంతు కోటయ్య సమన్వయకర్తగా వ్యవహరించగా, స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, పరిపాలన అధికారి డాక్టర్ ఎన్‌వీసూర్య నారాయణ, యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు ప్రోత్సహిస్తే కేసులు

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్


మాట్లాడుతున్న ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ


సమావేశంలో మాట్లాడుతున్న బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

గజపతినగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా బాల్యవివాహాలు జరిపించిన, ప్రోత్సహించిన వారిపై పోలీస్ శాఖ కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం గజపతినగరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాల్యవివాహాల నివారణ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామ, జిల్లా స్థాయి బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని అధికారులు మరింత కఠినంగా అమలు చేయడం కోసం చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామ, వార్డు, వలంటీర్‌లు, సచివాలయాల సిబ్బంది బాల్యవివాహాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ గ్రామాల్లో సఖి గ్రూపుల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల వల్ల బాలల భవిష్యత్తు అంధకారంలో కూరుకుపోతుందని, ఆరోగ్యపరంగా, విద్యాపరంగా, మానసికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో బాల్యవివాహాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా సంఘాలు బాలలతో పనిచేసే సంస్థలు, సంఘాల అందరి భాగస్వామ్యంతో (కలిసికట్టుగా) బాల్యవివాహాల రహిత సమాజంగా నిర్మించి రాష్ట్రాన్ని బాలల స్నేహపూర్వక రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని అప్పారావు పిలుపునిచ్చారు. ఇంకా బాల్యవివాహాలు జరుపుతున్న తల్లి దండ్రులు, జరిపిస్తున్న పురోహితులు, కుటుంబ సభ్యులపై పోలీస్ కేసులు నమోదు చేయాలని అధికారులకు కమిషన్ ద్వారా ఆదేశాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు.

తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పిల్లల నడవడిక, ప్రవర్తన, పట్ల తల్లి దండ్రులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ అన్నారు.పిల్లలకు అన్నివిషయాల్లో పూర్తి స్వేచ్ఛను ఇచ్చి వారికి కావాల్సినవి ఇవ్వడం మంచిదే గాని హద్దులు దాటి చేయడం మంచిది కాదని ప్రస్తుతం తల్లిదండ్రుల వల్లే పిల్లలు పూర్తిగా పాడవుతున్నట్లు సర్వే రిపోర్ట్‌లు చెబుతున్నాయన్నారు. పిల్లలు పట్ల తల్లి దండ్రులు ఏమరు పాటు పడకుండా పిల్లల భవిష్యత్తు విషయంలో శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక,స్థానిక తహసీల్దార్ అరుణకుమారి, సీడీపీఓ పి.నాగమణి, ఎంపీడీఓ పప్పు సుదర్శనం, ఎంఈఓ విమలమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎస్.పైడిరాజు, బి.త్రినాథరావు, పలువురు సర్పంచ్‌లు, విద్యావేత్తలు, వైద్యులు, మహిళా పోలీసులు, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి దుర్మరణం

- ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో ప్రమాదం


ప్రమాదంలో మరణించిన గురాన పవన్


మృతదేహం వద్ద విషణ్ణ వదనంలో తండ్రి రాము


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేష్

డెంకాడ: మండలంలోని నాతవలస వద్ద విశాఖ–శ్రీకాకుళం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరి విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై డెంకాడ ఎస్సై మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూసపాటిరేగ మండల కేంద్రానికి చెందిన గురాన పవన్(21), పతివాడ రామకృష్ణ, లెంక నారాయణరాజు మోటార్‌సైకిల్‌పై డెంకాడ మండలంలోని జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నాతవలస వద్ద జాతీయ రహదారిపై రాంగ్ పార్కింగ్‌లో ఆగి ఉన్న లారీని వారి మోటార్ సైకిల్ ఢీకొంది. దీంతో విద్యార్థి గురాన పవన్ అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరి విద్యార్థులు పతివాడ రామకృష్ణ, లెంక నారాయణరాజులు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు. విద్యార్థులందరూ పూసపాటిరేగకు చెందిన వారే. డెంకాడ ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గురైన ముగ్గురు విద్యార్థులు జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. శుక్రవారం ఉదయం కళాశాలకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వీరు ప్రమాదానికి గురయ్యారు. దీంతో కళాశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అందొస్తాడనుకున్న కొడుకు అర్థాంతరంగా..

కుమారుడు పవన్ ఇంజినీరింగ్ పూర్తి చేసి తమకు అందివస్తాడనుకుని, ఆశగా ఉన్న తల్లిదండ్రులకు తీవ్ర విషాదం మిగిలింది. అందివస్తాడనుకున్న కొడుకు శాశ్వతంగా అందకుండా పోవడంతో కుమారుడు పవన్ మృతదేహం వద్ద కుటుంబసభ్యులు భోరున విలపించారు.

కారు ఢీకొని మహిళ..

పాచిపెంట: మండలంలోని పాంచాలి గ్రామంలో శుక్రవారం కారు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటనపై ఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాంచాలి నుంచి సాలూరు వెళ్తున్న ఓ కారు గ్రామ శివారులో మహిసర్ల ధమయంతి(57)ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధమయంతిని స్థానికులు సమీపంలోని గురువునాయుడుపేట పీహెచ్‌సీకి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది. మృతురాలి చెల్లి సరస్వతి ఫిర్యాదుమేరకు ఎస్సై కేసునమోదు చేశారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి జిల్లాలో చిరుజల్లులు

ఆమదాలవలస: వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా శనివారం నుంచి ఈ నెల 26 వరకు శ్రీకాకుళం జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులతో పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ వర్షాన్ని రైతులు వినియోగించుకుని వరి, నువ్వులు, వేసవి పెసర, చెరుకు పంటల్లో పైపాటు ఎరువులు వేసుకోవచ్చునని సూచించారు.

నీలగిరి తోటలో అగ్ని ప్రమాదం



విద్యుత్ కాంతులతో అమ్మవారి ఆలయం

ఎచ్చెర్ల క్యాంపస్: భగీరథపురం పరిధిలోని నీలగిరి తోటల్లో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గాలులు బలంగా ఉండటంతో 50 ఎకరాల్లో మంటలు ఎగిసి పడ్డాయి. స్థానిక అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. 29 మంది వరకు రైతులకు చెందిన తోటలు ఉంటాయి. రైతులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు.

చిరుత పులి సంచారం అవాస్తవం

వజ్రపుకొత్తూరు రూరల్: బెండి గేటు ఫ్లై ఓవర్ వద్ద చిరుత పులి సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో శుక్రవారం విపరీతంగా ప్రచారం జరిగింది. అయితే ఇది తప్పుడు ప్రచారమని కాశీబుగ్గ అటవీ శాఖాధికారి ఎ.మురళీకృష్ణ నాయుడు స్పష్టం చేశారు. అనంతపురంలో చిత్రీకరించిన దృశ్యాలను బెండిగేటు పరిసరాల్లో సంచరిస్తున్నట్లు తప్పుగా ప్రచారం చేశారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలాంటి చిరుత పులి సంచారం లేదని, ప్రజలు భయాందోళన చెందాల్సిన పని లేదని అన్నారు.

29న టిడ్కో ఇళ్లు ప్రారంభం



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

శ్రీకాకుళం రూరల్: ఈ నెల 29న టిడ్కో ఇళ్లను ప్రారంభించనున్నట్లు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పాత్రునివలసలో నిర్మితమైన టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.150 కోట్లతో ఈ టిడ్కో ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించిందని చెప్పారు. 29న లబ్ధిదారులకు ఇళ్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నాగావళి నదిలో సురక్షిత మంచినీటి సరఫరా పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పాత్రునివలసలో నిర్మాణం జరిగిన 1280 టిడ్కో ఇళ్లకు సంబంధించి హౌసింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు వంద శాతం పూర్తయ్యాయని సంబంధిత ఇంజినీరింగ్ అండ్ కాంట్రాక్ట్ ఏజెన్సీ సిబ్బంది టిడ్కో చైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్, టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నీలమణి దుర్గమ్మ మహోత్సవాలు



విద్యుత్ కాంతులతో అమ్మవారి ఆలయం

పాతపట్నం: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పాతపట్నం నీలమణి దుర్గమ్మ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 30వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఘనంగా అమ్మవారి 48వ వార్షిక నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

25న సర్టిఫికెట్ల పరిశీలన

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో జనవరి 1, 2016 నుంచి డిసెంబరు 31, 2019 మధ్యలో (శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో) ఉద్యోగం చేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులలో ఒకరికి వారి అర్హతను బట్టి కారుణ్య నియామకాలను చేపట్టనున్నట్లు ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 25వ తేదీన విజయనగరం డీపీటీఓ కార్యాలయంలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ముందు సమాచారం ఇచ్చామని, కానీ అనివార్య కారణాల వల్ల 25కు మార్చామని తెలిపారు. అభ్యర్థులు ఈ మార్పును గమనించి ఈనెల 25వ తేదీన వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

వేసవిలో హాయిగా..



విద్యా సంవత్సరం ముగుస్తోంది. పిల్లలకు వేసవి సెలవులు దగ్గరపడుతున్నాయి. బంధువుల ఇళ్లకు వెళ్లడం, టూర్లు ప్లాన్ చేయడం వంటి ప్లాన్లు ప్రతి ఇంటిలోనూ ప్రస్తుతం మునాయిదా దశలో ఉంటాయి. అయితే వేసవికి ఇంకో ఆప్షన్ కూడా ఉంది. ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టే వారు తమకు ఇష్టమైన రంగంలో ఈ సెలవుల్లో ఎంచక్కా శిక్షణ తీసుకోవచ్చు. పాటలు నేర్చుకోవడం, ఏదైనా సంగీత పరికరం వాయించడంలో తర్ఫీదు తీసుకోవడం, నచ్చిన ఆటలో ప్రావీణ్యత సంపాదించడం.. ఇలా తమ అభిరుచి మేరకు కళలు, క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవడానికి సమ్మర్ సెలవులు ఉపయోగపడతాయి. అందుకు తగ్గట్టుగానే జిల్లా కేంద్రంలో వేసవి శిక్షణ శిబిరాలు సిద్ధమవుతున్నాయి.

- జిల్లా కేంద్రంలో వేసవి శిక్షణ శిబిరాలు
- అన్ని రకాల కళలపై తర్ఫీదు

శ్రీకాకుళం కల్చరల్ : జిల్లాలో వేసవి శిక్షణ శిబిరాలకు పలు సంస్థలు సిద్ధమవుతున్నాయి. శాస్త్రీయ సంగీతంపై నేటి యువతకు ఆసక్తి పెరుగుతోంది. పిల్లలను కూడా సంగీతం నేర్చుకోమని తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. అలాగే ఇంకొన్ని కళల్లోనూ చేరుస్తున్నారు. వీరికి శిక్షణ ఇవ్వడానికి 30 రోజులు, 45రోజుల పాటు తరగతులను ఏప్రిల్ 24నుంచి, మరికొందరు మే ఒకటి నుంచి ప్రారంభిస్తున్నారు. వేసవి శిబిరాల్లో కొన్నింటిని పరిశీలిస్తే..



సంగీత నిలయంలో సాధన చేస్తున్న దృశ్యం (ఫైల్)

కీబోర్డు, గిటార్, వోకల్

- సంగీత విభాగంలో కత్తెరవీధిలోని శ్రీ రాజరాజేశ్వరి సంగీత పీఠం వారు గాత్రం, వయోలిన్, కీ-బోర్డు, మృదంగంలపై శిక్షణ కూడా ఇస్తారు.

వివరాలకు: 94405 13579

- పట్టణంలో పాండురంగవీధిలో ఉన్న వీఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో కీబోర్డు, గిటార్, వోకల్ శిక్షణ ప్రారంభమైంది. మాస్టర్ సీహెచ్. వేంకటరావు ఆధ్వర్యంలో వేసవిలో రెండు నెలలపాటు ఈ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

వివరాలకు: 93906 11285



గిటార్ శిక్షణ పొందుతున్న యువకులు

సంగీతం

రెడ్డి సత్యనారాయణ శృతిలయ సంగీత శిక్షణాలయంలో ఏప్రిల్ 24 నుంచి మే 31 వరకు శాస్త్రీయ సంగీతంలో ప్రాథమిక అంశాలు, భక్తి, దేశభక్తి, లలిత గీతాలు, భజన్స్, కీబోర్డు, ట్రాక్ సింగింగ్, తబలా, డోలక్, ఎలక్ట్రానిక్స్ రిథమ్స్ నేర్పుతారు.

వివరాలకు: 95027 57479

- మొండేటి వీధిలో మల్లెమొగ్గల లక్ష్మీ, షిరిడిసాయి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులను మే 1నుంచి జూన్ 9 వరకు సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహిస్తారు. అన్న మయ్య సంకీర్తనలు, భక్తి సంగీతం నేర్పుతారు.

లెక్కల చిక్కులు విప్పుదాం



- వేసవిలో చిన్నారులకు లెక్కలు నేర్పించేందుకు పట్టణంలోని మాధవ్ మోటార్స్ పక్కన గల అబాకస్ వేదిక్ మ్యాథమెటిక్స్ వారు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 27 నుంచి ఇక్కడ 2 నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక స్థాయి, ఆపైన 6నుంచి 9 వ తరగతి స్థాయి వాళ్లకు నేర్పుతున్నారు. దీంతో పాటుగా హ్యాండ్ రైటింగ్ పైన కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

వివరాలకు: 99488 19718

నృత్యం

- సంప్రదాయం కూచిపూడి గురుకులం, కళ్లేపల్లిలో కూచి పూడి నృత్యం, కర్ణాటక సంగీతంపై వేసవి శిక్షణ తరగతులు ఏప్రిల్ 24 నుంచి మే 10 వరకు జరుగుతాయి. అక్కడికి వెళ్లేందుకు బస్సు సదుపా యం కూడా ఉంది.

వివరాలకు: 94406 81083

- వంశధార కాలనీలోని శివశ్రీ నృత్య కళానికేతన్‌లో మే 1 నుంచి జూన్ 10 వరకు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం నేర్పిస్తారు. రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణలు.

వివరాలకు: 94405 50330

- శాంతినగర్ కాలనీ మూడో లైనులో శ్రీ సత్యసాయి నృత్య కళానికేతన్‌లో మే 1నుంచి జూన్ 10 వరకు శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యాలు నేర్పుతారు. ఎస్‌పీ కవిత తర్ఫీదు ఇస్తారు.

వివరాలకు: 99515 43434

- తిమ్మరాజు నీరజ అభినయ నృత్యనికేతన్‌లో మే 1నుంచి జూన్ 10 వరకు సాయంత్రం 5 గంటల నుంచి భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యం, సంగీతం నేర్పిస్తారు.

వివరాలకు: 97055 37328





నృత్యం శిక్షణ ఇస్తున్న శ్రీకాంత్

చిత్రలేఖనం



- పాతశ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రాయింగ్‌పై ఉచిత వేసవి శిక్షణ నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ ఎల్.నందికేశ్వరరావు తెలిపారు.

వివరాలకు: 94410 72761

కరోనా ఘంటిక

- జిల్లాలో మళ్లీ కోవిడ్ కేసులు
- రిమ్స్‌లో ఐదుగురు వైద్యులు, ఒక పీజీ విద్యార్థికి పాజిటివ్
- లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవడం ఉత్తమ
- గ్రామస్థాయిలోనే వైద్యానికి ప్రభుత్వం చర్యలు





శ్రీకాకుళం: జిల్లాలో కరోనా ప్రమాద ఘంటిక మరోమారు మోగింది. దాదాపు అందరూ మర్చిపోయిన వేళ జిల్లాలో కొత్తగా కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కావడం కలకలం రేపుతోంది. జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్‌లోని ఐదుగురు వైద్యులు, ఒక పీజీ విద్యార్థి కరోనా బారిన పడిన ప్రస్తుతం ఐసోలేషన్‌లో ఉన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోనే ఓ బ్యాంకులో ముగ్గురు ఉద్యోగులకు పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. వీరంతా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్ష చేయించుకోవడంతో కరోనా కేసులు బయటపడ్డాయి. అయితే లక్షణాలు ఉన్నా చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పరీక్షలు చేయించుకోవడం లేదు. వీరి వల్ల వ్యాధి మరింత వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వైద్యులంటున్నారు. సామాజిక దూరం పాటించడం, మాస్క్ ధరించడం, చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరిగే బలమైన ఆహారం తీసుకోవడం మళ్లీ అలవాటు చేసుకోవాలి.

పల్లెల్లోనే వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం కరోనా బారిన పడే వారికి గ్రామస్థాయిలోనే వైద్యం అందజేసేందుకు నిర్ణయం తీసుకుంది. సచివాలయాల్లోని ఆరోగ్య కార్యకర్త వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వారికి పరీక్ష జరిపించి, పాజిటివ్‌గా నిర్ధారణ జరిగితే అవసరమైన మందులను వారికి అందజేసి, ఐసోలేషన్‌లో ఉంచేటట్లు చర్యలు తీసుకుంటారు. ప్రతి రోజు వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి లక్షణాలు తీవ్రమైతే సమీపంలోని ఏరియా ఆస్పత్రి, సబ్ సెంటర్‌లకు తరలిస్తారు. ఇంకా అవసరమైతే జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తారు. అన్ని ఏరియా ఆస్పత్రుల్లోనూ ఆక్సిజన్ సిలిండర్లు, అవసరమైన మందులను సిద్ధం చేశారు.

రిమ్స్‌లో ప్రత్యేక వార్డు

శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో కరోనా బాధితుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. ఇందులో 150 పడకలు ఉన్నాయి. మొత్తం 930 పడకల ఆస్పత్రి కాగా దాదాపుగా అన్ని బెడ్లకు ఆక్సిజన్ అందించే సౌకర్యం ఉంది. అయితే ఇటీవల కొన్ని చోట్ల మరమ్మతులు రావడంతో 700 పడకల వరకు ఆక్సిజన్ అందించే సౌకర్యం ఉంది. గతంలో వ్యాధి విజృంభించినప్పుడు రెండు లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లు నెలకొల్పడంతో 700 పడకలకు నిరంతరంగా వారం నుంచి పది రోజుల పాటు సరఫరా చేయగల సౌలభ్యం కలిగింది. ప్రభుత్వం ఎన్ని సౌకర్యాలు కల్పించినా, ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే వ్యాధి అదుపులో ఉంటుందని వైద్యులంటున్నారు.

వార్డులు సిద్ధం



రిమ్స్‌లో కరోనా రోగుల కోసం ప్రత్యేక వార్డులను సిద్ధం చేశాం. మందులు కూడా సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుత వేరియెంట్ వల్ల ప్రమాదం లేకపోయినా జాగ్రత్తలు పాటించడం అవసరం. కోవిడ్ తగ్గిపోయినా దుష్ప్రభావాలు తర్వాత కూడా ఉంటాయి. – డాక్టర్ కె.సునీల్ నాయక్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

రైతు ఇంటి వద్దకు పశువైద్య సేవలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం: జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో పాడి రైతులకు అందజేస్తున్న పశువైద్య సేవలను రైతుల ఇంటి వద్దనే అందేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులకు ఉపయోగపడేలా అనేక అంశాలపై చర్చించారు. పాడి, దుక్కి రైతులకు ఉపయోగపడేలా సంచార వాహనాల ద్వారా అందిస్తున్న పశువైద్య సేవలు రైతులకు అందేలా గ్రామస్థాయిలో ప్రచారం చేయాలన్నారు. చేయూత, పీఎం కేసీసీ 12 నెలలకు సంబంధించి ముందస్తు ప్రణాళికలను తయారు చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఎరువులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా కార్యాచరణ తయారు చేసుకోవాలని సూచించారు. సాగునీటి ఇబ్బందులు లేకుండా కాలువల్లో పూడికల తొలగింపు, షట్టర్ల మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొన్న పశుసంవర్ధక శాఖ జేడీ ఎం.కిశోర్ మాట్లాడుతూ 1962 సంచార పశువైద్య వాహనాలు జిల్లాలో పర్యటిస్తూ రైతుల ఇంటి వద్దకు సేవలు అందజేస్తున్నాయని అన్నారు. పాడి రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలను రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ నేతాజీ, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, చల్లా అలివేలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చే యజమానులుగా ఎదగాలి

- మేనేజ్‌మెంట్ విద్యార్థులతో ఐటీటీ సీఈఓ రజనీస్ వసంత



రజనీస్ వసంతను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

టెక్కలి: ఎంబీఏ, బీబీఎం, ఇతర మేనేజిమెంట్ కోర్సులు చదువుతున్న ప్రతి విద్యార్థి ఒకరి వద్ద ఉద్యోగం చేసేలా కాకుండా మరో పది మందికి ఉద్యోగాలు కల్పించే వారిగా ఎదగాలని అంతర్ ఐఓటీ సీఈఓ రజనీస్ వసంత ఆకాంక్షించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చతుర-23 కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో అనుభవం కోసం చిన్న చిన్న వ్యాపారాలు చేయాలన్నారు. కంపెనీలు నిర్వహించే సర్టిఫికెట్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్న్‌షిప్‌లో విధిగా పాల్గొనాలన్నారు. కంపెనీకి నాయకత్వం వహించే సామర్థ్యాన్ని విద్యార్థి దశ నుంచి అలవరుచుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్కెట్ స్కిల్స్ నేర్చుకోవడంతో పాటు నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం బీబీఎం, ఎంబీఏ విద్యార్థులకు మార్కెట్ మంత్ర, స్మార్ట్ ఇన్వెస్టర్, జగ్‌మీట్ పోటీలు.. బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులకు క్విజ్, డిబేట్, ఇన్నోవేటర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పద్మావతి డిగ్రీ కళాశాల, గాయత్రీ డిగ్రీ కళాశాల, అంబేడ్కర్ యూనివర్సిటీ విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 200 మంది విద్యార్థులు హాజరైనట్లు కార్యక్రమం కన్వీనర్ బి.శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, డి.విజయ్‌కుమార్, పి.దినకర్, చింతామణి ప్రసాద్ పట్నాయక్, కె.వేణుగోపాల్, డి.బలరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో బాలత్రిపురసుందరి



బలగలోని నాగావళి నదీ తీరాన బాల త్రిపుర కాలభైవర పీఠం దేవాలయంలో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా పీఠం నిర్వాహకులు గణేష్ గురుజీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

తప్పిన పెను ప్రమాదం



బెండికొండ వద్ద విద్యుత్ తీగలపై కూలిన మర్రి చెట్టు

వజ్రపుకొత్తూరు/రూరల్: బెండి కొండ దత్తాత్రేయ ఆశ్రమం సమీపంలో గురువారం అర్ధరాత్రి విద్యుత్ తీగలపై భారీ మర్రి చెట్టు విరిగిపడింది. అర్ధరాత్రి కావడం, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బెండిగేటు కూడలి నుంచి బెండి గ్రామానికి వెళ్లే మార్గంలో 50 ఏళ్లకు పైబడి భారీ మర్రి వృక్షాలు ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా వీటి కొమ్మలు పట్టు కోల్పోయి రోడ్డుపై తరచూ విరిగి పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్‌తో రద్దీగా ఉన్న సమయంలో ఇలా జరిగితే భారీ నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు 11 కేవీ విద్యుత్ తీగలపై చెట్టు పడడంతో సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో బెండి, వజ్రపుకొత్తూరు, మంచినీళ్లపేట వైపు ట్రాఫిక్ నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చెట్టు కొమ్మలు తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం సమీపంలో నీలం జ్యూట్ మిల్లు వద్ద శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా మద్రిపూడి మండలం కీమటి గ్రామానికి చెందిన అంబటి శ్రీనివాసరెడ్డి (28) మృతి చెందాడు. ప్రకాశం జిల్లా గోకవరం నుంచి శ్రీకాకుళం జిల్లా నిమ్మాడకు గ్రానైట్ రాళ్లు తీసుకొస్తుండగా ఎదురుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా కేబిన్‌లోకి గ్రానైట్ రాళ్లు రావడంతో డ్రైవర్ శ్రీనివాసరెడ్డి ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని సోదరుడు అంబటి వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

బ్యాంకులో కుప్పకూలి వ్యక్తి మృతి



మల్లేశ్వరరావు మృతదేహం

బూర్జ: మండలంలోని వావాం పంచాయతీ ఉప్పపేట గ్రామానికి చెందిన నీలంశెట్టి మల్లేశ్వరరావు (55) బ్యాంకులో కుప్పకూలి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేశ్వరరావు శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో గోల్డ్ లోన్ విషయమై నగదు జమ చేయడానికి వెళ్లాడు. కౌంటర్ దగ్గరకు వెళ్లేసరికి గుండెనొప్పి రావడంతో కుప్పకూలి పడిపోయాడు. బ్యాంకు సిబ్బంది 108 వాహనానికి ఫోన్ చేశారు. సిబ్బంది వచ్చేసరికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మల్లేశ్వరరావుకు భార్య అప్పలనర్సమ్మ, కుమార్తె ఉన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం



నెలివాడ ప్రచారభేరి నిర్వహిస్తున్న నాయకులు

రణస్థలం: దేశ సంపదను కార్పొరేట్‌లకు దోచిపెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని సీపీఎం నాయకుడు సీహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం, సీపీఐ నాయకులు శుక్రవారం నెలివాడలో ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులు, ప్రభుత్వ రంగసంస్థలు, వాడరేవులను, ఆఖరికి మన అందరికి అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాధత్తం చేస్తోందని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాల్సింది పోయి భారీగా కేటాయింపులు తగ్గించేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, ఉపాధిహామీ వేతనదారులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు చెక్కు అందజేత



టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నందిగాం మండలం కొండతెంబూరు గ్రామానికి చెందిన అనారోగ్య బాధితురాలు రాజశ్రీ తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నాయకులు

టెక్కలి: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలకు ఒక వైపు సంక్షేమ పథకాలు అందజేస్తూ.. మరో వైపు కష్టం కలిగిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వం కలిగిన మహోన్నతమైన వ్యక్తి అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఇటీవల సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు శంకుస్థాపన పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు నందిగాం మండలం దేవుపురం పంచాయతీ కొండతెంబూరు గ్రామానికి చెందిన కుడుము శ్రీనివాసరావు, అన్నపూర్ణ దంపతులు వారి కుమార్తె రాజశ్రీ అనారోగ్య పరిస్థితులను వివరించారు. దీంతో తక్షణమే సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలను మంజూరు చేశారు. ఈ మేరకు శుక్రవారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేతుల మీదుగా బాధితురాలు రాజశ్రీ తో పాటు తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు. తమ కుమార్తె అనారోగ్య పరిస్థితి గురించి సీఎం వైఎస్ జగన్‌కు విన్నవించిన వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేసి తమ కుటుంబానికి అండగా నిలిచారని బాధిత కుటుంబం వెల్లడించింది. తమకు సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు, పంచాయతీ పెద్ద యర్ర చక్రవర్తికి రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు యర్ర చక్రవర్తి, ఎం.గోపాలకృష్ణ, కె.నారాయణమూర్తి, పి.మోహన్‌రావు, ఆర్.ఢిల్లేశ్వరరావు, టి.బలరాం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.